క్లుప్తంగా

అవయవదానం గొప్పది..



కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్దుల్ రవూఫ్

విజయనగరం ఫోర్ట్: అన్ని దానాల్లో కన్నా అవయవదానం గొప్పదని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. గురువారం స్థానిక గురుదత్తా కళాశాలలో అవయవదానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఒకరి అవయవదానంతో ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు.

రైల్వే అప్రెంటిస్‌కు ఎంపిక



గిరి సాయి సుభాష్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం గ్రామానికి చెందిన విద్యార్థి గిరి.సాయి సుభాష్ రైల్వే అప్రెంటిస్(శిక్షణ)షిప్‌కు ఎంపికయ్యాడు. విజయనగరం రింగు రోడ్డులోని సత్య ఐటీఐ కళాశాలలో ఐటీఐ(ఎలక్ట్రికల్) పూర్తి చేసిన సుభాష్..రైల్వేశాఖలో అప్రెంటిస్‌షిప్ కోసం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలో ప్రతిభ చూపాడు. దీంతో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయిపూర్ డివిజన్‌లోని రైల్వేవ్యాగన్ వర్క్స్ డీజిల్ సెక్షన్‌లో అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఆర్డీ పర్యటన



కీర్తివీధిలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఆర్డీ నాగరాజు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో మున్సిపల్ ప్రాంతీయ సంచాలకుడు జి. నాగరాజు గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, సచివాలయాల పనితీరుపై కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులు, మొయిద జంక్షన్ వద్ద ప్రధాన కాలువలో చేపట్టిన పూడికతీత పనులు, 7వ వార్డు కీర్తివీధిలో చేపట్టిన పూడికతీత పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ పి. బాలాజీప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలి

విజయనగరం టౌన్ : దేశ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దుచేయాలని వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ హుస్సేన్ షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశఋరు. సవరణ బిల్లు వల్ల మైనారిటీలకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, హక్కులు హరించుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైనార్టీల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి, నల్ల చట్టాలకు తెలుగుదేశం పార్టీ మద్దతు తెలపడం సిగ్గుమాలిన చర్యన్నారు.

టోల్‌గేట్లు రద్దు చేయాలి..

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్ రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ. జగన్ మోహనరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. త్రైమాసిక రోడ్ టాక్స్ వసూల్ చేస్తున్నారని.. హైవేలో ఏప్రిల్ 1 నుంచి పెంచిన టోల్‌గేట్ చార్జీలతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విజయనగరం జొన్నాడ వద్ద పెట్టిన టోల్‌గేట్‌ను, రామవరం, మానాపురంల వద్ద ఏర్పాటు చేస్తున్న టోల్‌గేట్‌లు రద్దు చేయాలని కోరారు.

రంగారావుకు నివాళులు..

బొబ్బిలి: ఎమ్మెల్యే బేబీ నాయన తండ్రి, మాజీ ఎంపీ దివంగత ఆర్‌వీజీకే రంగారావు 98వ జయంతి సందర్భంగా స్థానిక బృందావనంలో ఉన్న స్మృతి వనంలో ఎమ్మెల్యే నివాళులర్పించారు. గురువారం జయంతి సందర్భంగా ఆయనతో పాటు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, స్థానికులు హాజరై రంగారావు సమాధి వద్ద నివాళులర్పించారు.

గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ సర్వే

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో ప్రజలకు అసరమైన తాగునీటిని కుళాయిల ద్వారా ఇళ్లకు అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.రెడ్డి తెలిపారు. మండలంలో జలజీవన్ మిషన్ (జేజేఎం) పథకం అమలు తీరు, తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లోని గ్రామాలకు ఇప్పటికే రెండు విడతల్లో ఇంటింటి కుళాయి ద్వారా నీరందిస్తున్నామన్నారు. మిగిలిన వారి వివరాలను సర్వేచేసి అందజేయాలని ఆయన సూచించారు. కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది పరస్పర సహకారంతో ఈ సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. ఆయా సచివాలయాల సిబ్బందిని ఈ సర్వే కోసం వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రవికుమార్, జేఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు పూర్తి..

- విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నిక
- రెండేళ్ల పాటు కొనసాగనున్న నూతన కమిటీలు



విజయనగరం : దుప్పాడ పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికైన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు పాఠశాలల అభివృద్ధిలో కీలకమైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల ప్రక్రియ గురువారం పూర్తయింది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ స్వల్ప ఇబ్బందులు నడుమ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 122 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా.. జొన్నవలస పాఠశాలలో తల్లిదండ్రులు ఇద్దరూ ఓటు వేసేందుకు పోటీ పడగా.... నిబంధనల ప్రకారం తల్లికి మొదటి ప్రాధాన్యం దక్కుతుందని అధికారులు చెప్పడంతో ఆమె ఓటు వేశారు. అదేవిధంగా దుప్పాడ పాఠశాలలో ఓ తరగతిలో కోరం లేకపోయినా ఎన్నిక నిర్వహించేందుకు ప్రయత్నించగా.. మండల విద్యాశాఖ అధికారి, తహసీల్దార్ కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్ది ఎన్నిక నిర్వహించారు. అదేవిధంగా అయ్యప్పనగర్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి హాజరుకాకపోవడంతో ఎన్నిక ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. ఓ వైపు కూటమి నాయకులు ఈ ఎన్నికలకు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తమకు అనుకూలమైన వారికి కమిటీలో చోటు కల్పించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు తమదైన శైలిలో గట్టి పోటీ ఇచ్చారు. దుప్పాడ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌గా నక్క అప్పలరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా చుక్క వరలక్ష్మి ఎన్నికయ్యారు. వీరిని సర్పంచ్ కరుమజ్జి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కెల్ల కృష్ణవేణి, కెల్ల త్రినాథరావు అభినందించారు. అదేవిదంగా కోరుకొండ ఎంపీయూపీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా గాలి నాగరాజు ఎంపికయ్యారు. కమిటీ పదవీకాలం రెండేళ్లపాటు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా జైరాజ్

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఎన్నికలో కమిటీ చైర్మన్‌గా సీహెచ్ సింహాద్రి (జైరాజ్) ఎన్నికయ్యారు. వైస్ చైర్‌పర్సన్‌గా పి. మాధవి ఎన్నికయ్యారు. వీరికి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా పర్వీన్, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ముచ్చు శ్రీనివాసరావు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా..

పూసపాటిరేగ : మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 65 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల, కేజీబీవీలో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కోనాడ, కుమిలి, కందివలస పాఠశాలలో ఎన్నికలు నిర్వహించగా.. మిగతా అన్ని పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికలను తహసీల్దార్ టి. గోవింద, ఎంపీడీఓ రాధిక, ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపునాయుడు పర్యవేక్షించారు.



నెల్లిమర్ల రూరల్: ఒమ్మి ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల



నెల్లిమర్ల రూరల్: అలుగోలు పాఠశాల కమిటీ సభ్యులను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, తదితరులు



విజయనగరం అర్బన్: కొత్తగా ఎంపికైన ఎస్‌ఎంసీ సభ్యులతో డిప్యూటీ మేయర్ ముచ్చు లయ, తదితరులు



విజయనగరం : దుప్పాడలో కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న అప్పలరాజు



పూసపాటిరేగ : గుంపాంలో ఎస్‌ఎంసీ ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ పాపినాయుడు, తదితరులు

71 పాఠశాలల్లో ..

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా ఉన్న 73 ప్రభుత్వ పాఠశాలలకు గానూ 71 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ తెలిపారు. జరజాపుపేట ఉన్నత పాఠశాలలో కోరం చాలకపోవడంతో ఎన్నిక వాయిదా పడిందన్నారు. ఒమ్మి ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా ఎన్నికైన మజ్జి కంచినాయుడును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు.. అలుగోలు, కొత్తూరు పాఠశాలలకు సంబంధించి కమిటీ చైర్మన్లుగా ఎన్నికైన నక్కెల్ల కళావతి, బూర్లె అప్పలనాయుడును వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం అభినందించారు.



డెంకాడ: అక్కివరం పంచాయతీ గొల్లపేట ఏపీ మోడల్‌స్కూల్‌లో ఎన్నికైన కమిటీతో ప్రిన్సిపాల్ సంధ్య, తదితరులు

66 పాఠశాలల్లో ..

డెంకాడ: మండలంలోని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 67 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు గాను 66 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తయ్యాయని మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటరమణ, వి.శ్రీరామ్ తెలిపారు. ఇందులో 32 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. గుణుపూరు ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా పడిందని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం : నగరంలోని పూల్‌బాగ్‌కాలనీ, రాజీవ్ ఇండోర్ స్టేడియం ప్రాంతాల్లో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్ల ఫీడర్ పరిధిలో..

నెల్లిమర్ల రూరల్: గుర్ల రూరల్ ఫీడర్ నుంచి నెల్లిమర్ల 11 కేవీ ఫీడర్ వరకు విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. మొయిద, నారాయణపురం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, చింతలపేట, పెదమజ్జిపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహరించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. చింతలవలస, ఏపీఎస్‌పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చొల్లంగిపేట, డి.కొల్లాం, కె.కొల్లాం, ముంగినాపల్లి గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అమటాం, రావివలసలో..

భోగాపురం : మండలంలోని అమటాం రావివలస సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఎ. రావివలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, భైరెడ్డిపాలెం, ముగడపేట, బొల్లింకలపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చాకివలస గ్రామాలతో పాటు విమానాశ్రయ నిర్మాణ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేసు కొట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న టీవీ రమణ, పైడిరాజు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: అనుమతి లేకుండా ధర్నా చేశారని అంగన్‌వాడీ సిబ్బంది, సీఐటీయూ నాయకులపై పెట్టిన కేసును మొబైల్ కోర్టు న్యాయమూర్తి గురువారం కొట్టేశారు. ఈ మేరకు న్యాయస్థానం వద్ద సీఐటీయూ నాయకుడు టీవీ రమణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ, అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ 2017 సెప్టెంబర్‌లో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశామన్నారు. అనుమతి లేకుండా ధర్నా చేశామని అప్పట్లో వన్‌టౌన్ పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేశారని చెప్పారు. అయితే నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేశారని తెలిపారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు



సమావేశంలోమాట్లాడుతున్న కామేశ్వరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: నవంబర్ 27 నుంచి 30 వరకు జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ఆహ్వాన సంఘం ఎన్నిక గురువారం స్థానిక అమర్‌భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడిగా మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, అధ్యక్షుడిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, చీఫ్ అడ్వైజర్‌గా సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్. నాగభూషణం, కోశాధికారిగా వి. రంగరాజు ఎన్నికయ్యారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై జరుగుతున్న దోపిడిని తిప్పి కొట్టడం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించనున్న ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జులు ఈశ్వరయ్య కోరారు. కార్యక్రమంలో రొంగలి పోతన్న, ఒమ్మి రమణ, కె.శివారెడ్డి, షేక్ మస్తాన్, ఫణీంద్ర, సాయికుమార్, కుల్లాయి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మండల ప్రత్యేకాధికారి జమదగ్ని



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు, మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, తదితరులు

డెంకాడ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల లక్ష్యం కావాలని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. మండలంలోని డి.కొల్లాం పంచాయతీలో గ్రామదర్శిని కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో మండలంలోని పలు విభాగాలకు చెందిన అధికారులు డి.కొల్లాం పంచాయతీ పర్యటించారు. పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, చిన్నారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, ఎంపీడీఓ లవరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- మండల ప్రత్యేకాధికారి సుధారాణి



గ్రామ సందర్శన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి



పూసపాటిరేగ: వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శాంతకుమారి, తదితరులు

భోగాపురం: మండల స్థాయి అధికారులందరూ ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి అన్నారు. ఎంపీడీఓ చంద్రకళ ఆధ్వర్యంలో మండలంలోని రావాడ గ్రామంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని గొల్లపేట ప్రాథమిక పాఠశాల, వెల్‌నెస్, రైతుసేవా కేంద్ర భవనాలు అర్ధంతరంగా నిలిచిపోయాయని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో లో ఓల్టేజీ సమస్య వేధిస్తోందని, అలాగే రెవెన్యూ పరమైన సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోయయాని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మండల ప్రత్యేకాధికారి స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, దంతులూరి సూర్యనారాయణరాజు, తహసీల్దార్ ఎం. సురేష్, ఆర్ఐ కిశోర్, ఈఓ సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీహెచ్ అగ్రహారంలో..

పూసపాటిరేగ: గ్రామంలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి అధికారులను ఆదేశించారు. మండలంలోని సీహెచ్ అగ్రహారంలో గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన వారందరికీ ఇళ్ల మంజూరు చేయాలని ప్రజలు కోరారు. అనంతరం అధికారులు వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారి రాజేషవర్మను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం. రాధిక, మండల ఇంజినీరింగ్ అధికారులు మురళీమోహన్, శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ఏపీఓ రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఫోరం ప్రతినిధులు



ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసిన ఫోరం ఫర్ బెటర్ విజయనగరం సంస్థ ప్రతినిధులు

విజయనగరం క్రైమ్: ఫోరం ఫర్ బెటర్ విజయనగరం సభ్యులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. సుమారు 16 స్వచ్ఛంద సంస్థలు కలిసి అప్పటి ఎస్పీ రంగారావు సూచనల మేరకు స్థాపించిన ఫోరం తనదైనశైలిలో సేవలందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు పూర్తిస్థాయిలో కృషిచేస్తామని, పోలీసులు చేపట్టే సేవా కార్యక్రమాలలో అందరినీ భాగస్వాములను చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, కార్యదర్శి రవ్వా శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, శంకర్‌రెడ్డి, బాలాజీ టెక్స్‌టైల్స్ మార్కెట్ అధ్యక్షుడు బి.వెంకటరావు, హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపకుడు అచ్చిరెడ్డి, లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవాసంఘం అన్నదాన ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెంబూరి మృతి తీరని లోటు..

విజయనగరం అర్బన్: బొబ్బిలి మాజీ ఎంపీ కెంబూరి రామ్మోహనరావు మృతికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సంతాపం తెలిపారు. ఆయన మృతి జిల్లా ప్రజలకు తీరని లోటని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఆయన ప్రజలకు మంచి సేవలందించారని తెలిపారు.

అందరి సహకారంతో అభివృద్ధి



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ప్రజలందరి సహకారంతోనే నగర అభివృద్ధి సాధ్యపడుతుందని కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. నగరంలోని 4వ డివిజన్ ఫూల్‌బాగ్ ప్రాంతంలో గురువారం వార్డు పర్యటన చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన కమిషనర్ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆ ప్రాంతంలో ప్రధాన గెడ్డవాగులో పూడికతీత పనులను పరిశీలించారు. దాదాపు 35 సంవత్సరాలుగా పూడికను తొలగించకుండా నిరుపయోగంగా ఉన్న వాగులో జేసీబీల సహాయంతో పనులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఖాళీ స్థలాల్లో చెత్త, చెదారాలు పేరుకుపోవడంపై కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని చిన్నారులకు అందిస్తున్న బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం వార్డు పర్యటన చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఈరోజు 4వ డివిజన్‌లో వార్డు పర్యటన చేపట్టమన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తాము కోరిన వెంటనే గెడ్డలో పూడికతీత పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, వివిధ విభాగాల అధికారులు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక రుగ్మతల సమస్యలపై న్యాయ సహాయం

బొబ్బిలి: ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఉన్న మానసిక, శారీరక వైకల్యం ఉన్న వారికి అవసరమైన న్యాయ సహాయం అందించే అవకాశాలున్నాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీలో న్యాయ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. న్యాయ సహాయం పొందేందుకు వైద్య సిబ్బంది వారికి సహకరించి కోర్టులను సంప్రదించేలా చైతన్యం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వివిధ విభాగాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యాధికారి గేదెల శశిభూషణ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవామృతంతో పంటకు మేలు

బొబ్బిలి రూరల్: నాణ్యమైన జీవామృతం తయారు చేసి వరి పంటకు వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి తులసి అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రైతులకు జీవామృతం తయారీ విధానాన్ని గురువారం వివరించారు. ఐసీఆర్‌సీలు, రైతులు పాల్గొన్నారు. మెట్టవలస గ్రామంలో నారు శుద్ధి చేసి కొనలను తొలగించి నాటడం ద్వారా రైతులకు మంచి దిగుబడులు సాధించవచ్చని అడిషనల్ డీపీఎం స్వామినాయుడు తెలిపారు. డీపీఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా ర్యాలీ



వస్త్రపురి కాలనీలో డయేరియాపై అవగాహనా ర్యాలీ

రాజాం సిటీ: పట్టణ పరిధి వస్త్రపురి కాలనీలో స్టాప్ డయేరియా ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జె.రామప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు డయేరియాపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.